క్లుప్తంగా

పంట పొలాల పరిశీలన



పిడుగురాళ్ల: ఇటీవల కురిసిన వర్షాలకు పంటల స్థితిగతులను పరిశీలించేందుకు శుక్రవారం పిడుగురాళ్ల పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో పలు పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. వర్షాలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగమణి, డాక్టర్ రాజేష్, పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

విజయపురిసౌత్: మెరుగైన వైద్య సేవలు మహిళల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు మహేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో స్వస్థనారీ– స్త్రీశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మహేష్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఈ పథకం ఎంతో దోహద పడుతుందని అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రావణ్ నాయక్, నిరంజన్ రెడ్డి, బాలు, రాణి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో సాధికారత సాధించాలి

మాచవరం: మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్త్రీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక, ఆరోగ్య సమస్యలు, పోషకాహారం, ఉపాధి అవకాశాలు, కుటుంబ సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంఈఓ శ్రీధర్ పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్ సస్పెన్షన్



పిడుగురాళ్ల: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసినట్లు పిడుగురాళ్ల రేంజ్ ఆఫీసర్ కె.విజయ్ కుమారి శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ల ఫారెస్ట్ పరిధిలోని మాదిన పాడు బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న బి. వెంకటేశ్వర్లుపై అడవిలో రంగురాళ్ల తవ్వకాలు, అక్రమ బోర్లు వేసినప్పటికి అటువంటివారిపై చర్యలు తీసుకోకపోవటం వలన అతడిపై సమగ్ర నివేదికను జిల్లా ఫారెస్ట్ అధికారికి అందించటంతో అతడిపై సస్పెండ్ వేటు పడిందని వివరించారు.

రక్తదానం గొప్ప సామాజిక సేవ

విజయపురిసౌత్: రక్తదానం గొప్ప సామాజిక సేవ అని డాక్టర్ మహేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం తరపున మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ మహేష్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం లేక చనిపోయే వారిని రక్తదాతలు కనీసం ఇద్దరిని కాపాడినట్లేనని, ఆరోగ్యవంతుడైన మనిషి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ రక్తదాన శిబిరంలో కళాశాల విద్యార్థులు 80 మంది ఏడుగురు అధ్యాపకులు ఒకరు స్థానికులు అని ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మహమ్మద్ బాషా తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, డెప్యూటీ వార్డెన్ సతీష్ బాబు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

పిడుగురాళ్ల: రైతులకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎం. సంధ్యారాణి శుక్రవారం తెలిపారు. సాక్షిలో గురువారం ఆంక్షలు... సిఫార్సులు అనే శీర్షిక పాఠకులకు విధితమే. ఈ క్రమంలోనే పిడుగురాళ్ల పట్టణంలోని జీడీసీఎంఎస్ గోదాములు 23,850 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోఉందని ఏఓ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీనివాసకాలనీలోని ఉన్నం హాస్పటల్, ఉన్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 320 మంది చిన్నారులకు వైద్య సేవలతో పాటు మందులు అందించారు. ఈ వైద్య శిబిరానికి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకల రామిరెడ్డి హాజరై చిన్నారులకు వైద్య సేవలు అందించారని డాక్టర్ ఉన్నం నాగ మల్లికార్జునరావు తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో 30 మంది చిన్నారులకు ఆరోగ్యశ్రీ సేవలకు రిఫర్ చేశారు.

ముగిసిన వర్క్‌షాప్

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో టూల్ బాక్సెస్‌పై నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. కళాశాల ఐట్రిపుల్‌ఈ ఇండస్ట్రీయల్ సొసైటి స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాపులో 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. అర్క్స్ సంస్థ ప్రాడక్ట్ మేనేజర్ పొన్నగంటి చందనా రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస రావు, ఐఈఈఈ ఐఈఎస్ స్టూడెంట్ చాప్టర్ అడ్వైజర్ డాక్టర్ వైఎస్ కిశోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో నాగార్జున యాదవ్‌తో వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్ సీపీ పిడుగురాళ్ల పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్ హౌస్ అరెస్ట్



వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రేపాల శ్రీనివాసరావు పోలీసుల వాగ్వాదం



వైఎస్సార్ సీపీ యువజన విభాగం గురజాల నియోజకవర్గ అధ్యక్షుడు సాంబశివరావు గృహనిర్బంధం

నిరసనపై జులుం

అదే జులుం.. చంద్రబాబు అసలు రంగు బయటపడింది. మారిన మనిషినని చెప్పిన మాటలు ఉట్టిమాటలుగా తేలిపోయాయి. ప్రైవేటు జపం అందుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైంది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఆందోళనపై బాబు సర్కార్ ఉక్కుపాదం మోపాడు. పోలీసులతో అడుగడుగునా నిర్బంధకాండ కొనసాగింది. ఇళ్ల నుంచి బయటికి రాకుండా పార్టీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. వచ్చిన వారిని కళాశాల వద్దకు వెళ్లకుండా అడ్డుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు.

–పిడుగురాళ్ల

ఇంకెంతకాలం నడకయాతన..

- అభివృద్ధికి దూరంగా దుర్గి– బొల్లాపల్లి రోడ్డు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

దుర్గి: రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇచ్చిన హామీని నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఎంతో కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న దుర్గి– వినుకొండ రోడ్డుకు మోక్షం లభించలేదు. వివరాలు.. దుర్గి నుంచి వినుకొండకు సుమారుగా 52కిలోమీటర్లు. రోడ్డు దశాబ్ధకాలంగా నిర్లక్ష్యానికి గురైంది. మండలాల పరిధిలోని జంగమహేశ్వరపాడు, మించాలపాడు, కాకిరాల, గండిగనుముల, సోలాయపాలెం, రావులాపురం, రేమిడిచర్ల, బొల్లాపల్లి గ్రామ ప్రజలు ప్రధాన సమస్యగా మారింది. ప్రతి నిత్యం వినుకొండ నుంచి మాచర్లకు వందలాదిగా ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు రాకపోకలు కొనసాగుతున్నాయి. నిత్యం బొల్లాపల్లి మండలంలోని ప్రజలు తమ రోజువారీ అవసరాల కోసం దుర్గి వెళ్ళి వస్తుంటారు. ఈ రోడ్డు పరిధి 14 కిలో మీటర్లులు మాచర్ల ఆర్ అండ్ బి సబ్ డివిజన్ పరిధిలో మిగిలిన 38 కిలో మీటర్లు వినుకొండ రహదారి శాఖలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో మాచర్ల, వినుకొండ ఎమ్మెల్యే పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతల మయంగా మారిన దుర్గి– వినుకొండ రోడ్డు

రాకపోకలకు ఇబ్బంది..



కూలీ పనుల కోసం బొల్లాపల్లి తదితర గ్రామాల నుంచి కూలీలు రావటానికి ఇష్టపడడం లేదు. రహదారి సక్రమంగా లేని కారణంగా పనులకు రావటానికి ఆసక్తి చూపడం లేదు. కొద్ది దూరానికే రవాణా ఖర్చులు వందలు ఇచ్చి ప్రైవేటు వాహనాలలో ప్రయాణించాల్సిన దుస్థితి.

–ఎ.శంకర్, దుర్గి

టెండర్ల ప్రక్రియ ప్రారంభం

దుర్గి– వినుకొండ వెళ్లే రహదారికి సంబంధించి దుర్గి మండల పరిధిలోని 14 కిలోమీటర్లకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది. రూ. 4 కోట్లతో నూతన రహదారికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

–సుబ్బారావు, ఏఈ, ఆర్ అండ్ బీ

యువజన, విద్యార్థి నాయకుల ప్రదర్శన

అరెస్ట్ చేసిన పోలీసులు

పిడుగురాళ్లరూరల్/మాచవరం: ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా చలో మెడికల్ కాలేజీ పిలుపు మేరకు విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని కామేపల్లిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని విద్యార్థి, యువజన విభాగాలు నాయకులు సందర్శించారు. దీనిలో భాగంగా మెడికల్ కాలేజీ వద్ద ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్టు చేసి ప్రైవేటు బస్సులలో మార్కెట్‌యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆకాష్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని, దీనిని వైఎస్సార్‌సీపీ తప్పకుండా అడ్డుకుంటుందని తెలిపారు. చలో మెడికల్ కాలేజీకి పిలుపులో భాగంగా వస్తే పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారని ఆరోపించారు. అనంతరం ర్యాలీ చేసే విద్యార్థి, యువజన విభాగం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



మెడికల్ కాలేజీ వద్దకు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్, విద్యార్థి, యువజన సంఘ నాయకులు

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రెంటచింతల: ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ మండల అధ్యక్షురాలు బేబిరాణి కోరారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని, ఉద్యోగులకు ఆర్థిక పరంగా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీ ఏర్పాటుచేసి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను పూర్తి సమయంలో విద్యార్థులకు బోధన చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7 న తలపెట్టిన నిరసన కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మండల గౌరవ అధ్యక్షులు లేళ్ల శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శి వెంకటేష్, జిల్లా నాయకులు అమలబాబు, భీముడు నాయక్, సిలార్ అహమ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ మండల అధ్యక్షురాలు బేబిరాణి

ఉచిత కుట్టు మిషన్‌లో శిక్షణ ప్రారంభం

పిడుగురాళ్ల: క్యూబ్ రూట్స్ ఫౌండేషన్, నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్ సంయుక్తంగా మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు పిడుగురాళ్ల పట్టణంలో శుక్రవారం నూతనంగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. క్యూబ్ హైవే రీజనల్ హెడ్ కె.కృష్ణారావు హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్యూబ్ రూట్స్ ఫౌండేషన్, నార్కెట్‌పల్లి, అద్దంకి, మేదరమెట్ల(నామ్) ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ కార్యక్రమాలలో భాగంగా ఈ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఈ ఉచిత కుట్టు మిషన్ కొంత మేరకు ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యూబ్ హైవే ప్రాజెక్టు హెడ్ శ్రీకాంత్ బాబు, డెప్యూటీ ప్రాజెక్టు హెడ్ బి.ప్రసాద్, సీనియర్ మేనేజర్ ముకేష్, రాంబాబు, మహీంద్ర, మల్లేశ్వరరావు, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రీజనల్ హెడ్ కృష్ణారావు

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



దాచేపల్లి: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ప్రిన్సిపాల్ ఎం.రంగారెడ్డి అన్నారు. స్థానిక స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. 9వ తరగతి చదువుతున్న ఇమ్రాన్ షాట్‌పుట్ బ్యాక్ త్రోలో రెండో స్థానం, గ్రేస్ కమల 60 మీటర్ల రేసులో మూడో స్థానం సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ రంగారెడ్డి, పీఈటీలు ప్రతాపరెడ్డి, రమేష్ నాయక్ అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవటంతో పాటు ఇష్టంతో ఆటలాడాలని ప్రిన్సిపాల్ సూచించారు. చదువుల తో పాటు క్రీడల్లోనూ రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన చెప్పారు.


సింథటిక్ రన్నింగ్‌ట్రాక్ పనుల పరిశీలన



నాదెండ్ల: అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న సింథటిక్ రన్నింగ్ ట్రాక్ పనులను విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి గురువారం ప్రారంభించారు. చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రామిరెడ్డి అందించిన రూ.50 లక్షల ఆర్థికసాయంతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని రన్నింగ్ ట్రాక్‌ను పరిశీలించి అదే తరహాలో ఇక్కడ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌కు రూ.50 లక్షలు వ్యయం కానుండగా, మరో రూ.10 లక్షలు సివిల్ పనులకు వెచ్చించనున్నారు. ప్రస్తు తం సివిల్ వర్క్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

దసరా ఉత్సవాలకు సత్రశాల దేవస్థానం సిద్ధం

రెంటచింతల: మండలంలోని కృష్ణానది తీరాన ఉన్న అత్యంత పురాతనమైన ప్రముఖ శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం దసర నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైనట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుండా వెంకట శివయ్య, ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. దేవస్థానంలో భ్రమరాంభి కాదేవి అమ్మవారు సెప్టెంబర్ 22న బాల త్రిపురసుందరీ దేవి, 23న శ్రీ గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణా దేవి, 25న కాత్యాయనీ దేవి, 26న మహాలక్ష్మీ దేవి, 27న లలితా త్రిపురసుందరీ దేవి, 28న మహా చండీ దేవి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గా దేవి, అక్టోబర్ ఒకటిన మహిషాసురమర్ధిని దేవి, విజయదశమి రోజు 2న రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఉంటుందని వివరించారు. అమ్మవారికి ప్రతి రోజు దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో కుంకుమార్చన, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయదశమి పండుగ రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



అతి పురాతనమైన సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం

కారెంపూడి పీహెచ్‌సీలో వైద్యశిబిరం

కారెంపూడి: స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారి ఆరోగ్య సంరక్షణకు తగిన సలహాలు సూచనలను వైద్యులు శుక్రవారం అందించారు. ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం ద్వారా వందలాది మందికి పీహెచ్‌సీలో వైద్య సేవలందించారు. గర్భిణులకు చెకప్‌తో పాటు చిన్న పిల్లల వ్యాధుల నిర్ధారణ తో పాటు వివిధ రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ కె.రమ్య, డాక్టర్ కె.లక్ష్మీ మౌనిక, హెచ్‌ఎస్‌లు మల్లయ్య, పీఎల్ మస్తాన్‌వలి, ఎం.లాలు నాయక్, వైద్య సిబ్బంది సేవలందించారు. ఇదిలా ఉంటే ప్రారంభ కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణపై గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అందించదగిన వైద్య సేవలు సేవా దృక్పథంతో అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బి.సరస్వతీబాయి పాల్గొన్నారు. అలాగే గాదెవారిపల్లె పీహెచ్‌సీలో కూడా నిర్వహించారు.

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు కీలకం

దాచేపల్లి: పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని ఎంఈఓ పినకాపాణి అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అందిస్తున్న విద్యా బోధనతో పాటు పాఠశాల అభివృద్ధిపై తల్లిదండ్రులతో చర్చించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఎంఈఓ పినాకపాణి మాట్లాడుతూ... విద్యార్థుల తల్లిదండ్రులు తరచూ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల పనితీరు పాఠశాల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తగరం ఆనంద్ కుమార్, స్థానిక నాయకులు ఓ.నాగేశ్వరావు, కటికల మరియదాసు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరావు, అధ్యక్షులు పప్పుల రాజారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు షేక్ మస్తాన్ వలి , ఉపాధ్యాయులు స్వర్ణ కుమారి, నాగజ్యోతి, యామిని, సుహాసిని పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ పినాకపాణి

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక



బాక్సింగ్ అండర్ -17 బాలికల జట్టు



బాక్సింగ్ అండర్-14 బాలుర జట్టు

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14, అండర్–17 బాక్సింగ్ జట్లు బాలురు, బాలికల విభాగంలో విడివిడిగా ఎంపిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ ఎంపికకు పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి సుమారు 220 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల బరువు ప్రాతిపదికన జట్లలోకి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం కె.కృపాదానం, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్, స్కూల్‌గేమ్స్ మహిళా సెక్రటరీ డాక్టర్ వి.పద్మావతి, పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా జట్లు ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరుజిల్లా స్కూల్‌గేమ్స్ అండర్–14, అండర్–17 బాల బాలికల స్విమ్మింగ్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 20వతేది శనివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్నట్టు పల్నాడుజిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్, మహిళా కార్యదర్శి వి.పద్మావతి శుక్రవారం తెలిపారు. పోటీలో పాల్గొనే సీబీఎస్‌సీ, కెవిఎస్, ఎస్‌వీఎస్ సెంట్రల్ సిలబస్ విద్యార్థులు తప్పనిసరిగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకరావాలన్నారు. అలాగే స్టేట్ సిలబస్ విద్యార్థులు స్టడీ, జనన ధృవీకరణ సర్టిఫికెట్లు తీసుకరావాలని స్పష్టం చేసారు. క్రీడాకారులు తమ సర్టిఫికెట్లతో స్విమ్మింగ్ పూల్ వద్ద ఉదయం 8.30 గంటలకు కోచ్ సురేష్‌కు రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 9703111115 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పెయింటర్‌పై దాడి

నరసరావుపేట టౌన్: కంభంపాలెంకు చెందిన కంభంపాటి సైకిలాబ్ పెయింటింగ్ పనులు చేస్తుంటా డు. ప్రకాష్‌నగర్ తిలక్ స్కూల్‌లో చదువుతున్న తన కుమారుడిని గురువారం స్కూటీపై ఎక్కించుకొని వస్తుండగా మార్గమధ్యంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటి ఎదుట మేకా నాగరాజు అటకాయించి అసభ్యపదజాలంతో దూషించాడు. ఎందుకు అనవసరంగా తిరుగుతున్నావని ప్రశ్నించగా చొక్కాపట్టుకొని బలవంతంగా నెట్టడంతో గాయమైంది. పాత వివాదాన్ని దృష్టిలో ఉంచుకొని బాధితుడిపై నిందితుడు దాడికి పాల్ప డ్డాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చరణ్ శుక్రవారం తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య



యడ్లపాడు: అనారోగ్యంతో ఉన్న వృద్ధుడు బలవన్మణానికి పాల్పడిన ఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగ్గాపురం గ్రామానికి చెందిన కొణతం బాబురావు అనే వృద్ధుడు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో గడ్డిమందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి బాబురావును చిలకలూరి పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సుబ్బారావు (65) మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతిడి పెద్ద కుమార్తె సుధారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆత్మహత్యకు కారణం అనారోగ్య పరిస్థితులే కావచ్చని పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిసింది.